వుట చేత యీ పార్టీ అంతగా రాణించడములేదు. అసలే తాబేలులాగు ప్రాకుతూ యాత్రచేస్తున్న దీనికి ప్రజాపార్టీవారు "ప్రజా"అనేది ఒకటి తగిలించి మెల్లగా జారుకున్నారు. దీనితో దాని ముఖంకూడా అందవికారమయిపోయింది. దేశములో మధ్యతరగతి ప్రజానీకపు జీవితములాగు దీని జీవితము నడుస్తోంది. ఆంధ్రదేశములో ప్రజా, కృషిక్‌లోక్‌పార్టీలు రెండూ దీనిలో కలిసిపోయి మూడోపార్టీగా తయారుచేయవలసింది. అంత ఓర్పు ఎవరికుంది? వెంటనే పదవులు అధికారం చిక్కాలి, తినాలి అనేవాళ్ళు ఎవళ్ళు చేరతారు దీనిలో? సమయానుకూలముగ ప్రజలను మోసగించి వాళ్ళ అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని ఉపయోగించుకోగల జిత్తులమారి నాయకత్వము సంపాదించేవరకు దీనికి అధికారం దక్కేటట్లు లేదు.

ఇక ప్రజా, కృషిక్‌లోక్‌పార్టీల చరిత్ర బహు చిన్న కథ. వీరు పదవుల సమస్యమూలంగానే విడిపోయారు. తిరిగి పదవులకోసమే కలిశారు. ఈ జాయింటు కంపెనీ నిజాయితీగా వ్యాపారం సాగిస్తేనే కాస్త లాభం పంచుకుంటారు. లాభం లేకపోయినా, వచ్చిన లాభం పంచుకునేదగ్గర తగవులొచ్చినా, వీరు ప్రజల ఎదుటకు రాలేరేమో!

స్కెచ్

# రాజాలాంటి ఉద్యోగం

వల్లూరి కృష్ణారావు

కాంపోజిషను పుస్తకాలు దిద్దుతున్న రాజా ఒక్కమాటు ఆగి "సరూ" అని పిల్చాడు భార్యని. షేక్స్పియరు నాటకాలు దొంతర్లుగా అలమారులో పేర్చబడ్డాయి. తను దిద్దాల్సిన 'కాంపోజిషను' పుస్తకాలు తన కరల్సు కాప్రింగులా చిందరవందరగా పడిఉన్నాయి. తనప్రక్కనే 'ఆక్స్‌ఫర్డు' డిక్షనరీ తెరచిపడిఉంది. సరూ జవాబుగా కాఫీ తెచ్చిఇచ్చింది. "ఈ కాంపోజిషన్సు ఇంక ఎప్పటికీ అవవా ఏం? రెండు గంటలునుంచీ కూర్చున్నారు. ఎన్ని సిగరెట్లయ్యాయి? ఎన్ని పెద్దారు?"అంది విసుగ్గా.

"ఏమిటా కాలము పని మీద లెక్క?"

"నా తలకాయ—ఎప్పుడూ ఇదేగోడవ, చస్తున్నాను. వెధవది లెక్కలు 'సబ్జెక్టు' ఇచ్చేరేమిటండి? ఖర్మ!"అని శ్రీమతి లోపలకు పోయింది.

రాజా ఆలోచిస్తున్నాడు. తనెప్పుడయినా ఊహించాడా ఈ రొంపిలో దిగబడ్తాడని? ఎప్పుడయినా కనీసం కలలోకూడా అనుకోలేదే! పోనీ తన తల్లిదండ్రులు, ఆలితరపున చివరకు ముసలి బామ్మకూడా అనుకోలేదే! "వాడికి మాస్టరీ ఏం ఖర్మరా! నిక్షేపంలాంటి వాడికి...లక్షణంగా..."

రాజాకి నవ్వువచ్చింది. బామ్మ చాదస్తపుది. నిక్షేపంలాంటివాడు మాస్టరీ చెయ్యడుకామోసు.

తాను బి. ఏ. చదువుతున్నప్పుడు తనకు తాను పెద్దగా ఊహించుకున్నాడు. కంటికి నదరుగా కనపడే ఉద్యోగాలు తన కెదురుగా నాట్యం చేశాయి. తాను ఊహించిన కలలు ఎప్పుడూ నిజమయ్యాయి. తాను పెళ్ళాడబోయే అమ్మాయిని చక్కనిదానిగా ఊహించాడు. సరూ నిజంగా అందంగా ఉంటుంది. తనకు కట్నం ఎక్కువ అంచనా వేసుకున్నాడు. అంచనాకు పైనే వచ్చింది కట్నం. తను మొదటి ధపాలో బి. ఏ. లో కృతార్థుడవుతాడనుకున్నాడు. రాజా ఇందులోకూడా నెగ్గాడు. ఇలా తాను ఊహించినవి ఊహించినట్లుగా జరిగినమూలాన్న తన ఊహాలు పగటి కలలుకావని, పేకమేడలా కూలవని నమ్మాడు. తన ఉద్యోగం తనకు, తనను ఎరిగినవారికి కొత్తదనం, తనకు హుందా, దర్పం తెస్తుందనుకున్నాడు. తనకు సంతకాలుపెట్టే ఉద్యోగం వస్తుందని జోస్యం చెప్పుకున్నాడు. తన సంతకపు నమూనాను తీర్చిదిద్దుకున్నాడు.

కాని-చివరన అగ్నిపర్వతం బ్రద్దలయింది. తాను ఊహించలేని, నమ్మలేని ఘోరఅన్యాయం తనకు జరిగింది. తనక్రింద అణిగిమణిగి పడిఉన్న విధి ప్రక్కకు వత్తిగిలిలేచి ప్రజ్వలించింది. రాజా అంటాడు తనకి ఆఖరికి ఘోరపతనం జరిగిందని!

రాజాను రాజా కళ్ళు పెట్టుకుచూస్తే రాజాకు అన్యాయమే జరిగింది. తనకు నచ్చని ఉద్యోగం తనకి ఎందుకురావాలి? ఈ ప్రశ్నకు సమాధానం ఎప్పుడు, ఎలా రాజాకు దొరుకుతుంది?

తనను ఎలా చూసినా,ఎలాకొలిచినా తను మాస్టరీకి సరిపోడని తనవాదన. తనకసలు 'మాస్టరీరూపు' లేదంటాడు. తను మామూలుగా సినిమాలలో చూపించే మాస్టరులా ఛస్తేఉండడు. తను సిజర్సు తాగుతాడే! తాను ఎప్పుడూ సూటులో ఉంటాడే! తన క్రాఫింగు గిరిజాలతో మెట్లతోఉంటుందే! తాను రోజుకు నాలుగుమాట్లు కాఫీలేందే ఉండలేడే! ఏ సినిమా పాటయినా 'రిఫరెన్సు'తో సహా చెప్పగలడే! తనగదిని చక్కగా అలంకరించుకోగలడే! ఇన్ని నాజూకులక్షణాలుగల తను ఉపాధ్యాయుడవుతాడని ఊహించుకోగలడా?

పరిస్థితులు కూడా రాజాకు ఉపాధ్యాయ వృత్తి స్వీకరించవలసిన అగత్యంకలిగించలేదు. తన తండ్రి, మామగార్లు కూడా ఇంతో అంతో పలుకుబడిగల ఉద్యోగాలు కలవారే! పెద్దవారితో సంబంధంగల వంశము రాజాది. మరి ఇట్టి రాజా, అక్రమంగా(!) ఇప్పుడు మామూలు బడిపంతులు!

"తనకి అన్యాయం ఎలా జరిగిందని" కన్నీళ్లు కార్చాడు రాజా. మానవునికి ఖర్మమీద పెద్ద నమ్మకం. ఆశలు నిరాశలయాక, తాను కట్టినది పేక మేడలని తెలిసాక తాను ఆశించినది తన కందని పండని తను అర్థంచేసుకొన్నాక మానవుని చేతులు ముందే నిర్ణయింపబడ్డాయని, తన ఖర్మకు తను యజమానికాడని, తన రాత రీతిని తప్పదని వేదాంతం వినిపిస్తాడు.

"మాస్టరీ - వెధవధి, క్షయ, కుష్టులాంటిది." రాజాకు గుండె వేడెక్కింది. రాజా క్రుంగిపోతున్నాడు. ఒక్కమాటు తుఫాను ప్రజ్వలించింది. సూర్యంగారి మాటలు సముద్ర ఘోషలా వస్తున్నాయి:

"మాస్టరు కొడుకు మాస్టరు. మనుమడు మాస్టరు. మరొక విచిత్రం. ఇప్పుడు మీరు బి. ఇడి. కదా! మీరు మీ కొడుకును 'సెకండరీ'కి మాత్రమే పంపించగలరు. మీ మనుమణ్ణి 'హయ్యరు'కు మాత్రమే (అప్పటికిఉంటే)మీ మునిమనుమడు మీ కులవృత్తి ఏదైనా ఉంటేగింటే—"

"ఏమిటిదంతా?" రాజా అరిచాడు.

"రాజాగారూ! మరోలా అనుకోకండి. ఇలాటి పేర్లు మాస్టర్లకు చాలా అరుదుగా ఉంటాయి." రాజా కళ్ళు ఎర్రబడ్డాయి. రష్యన్ సారాయి తాగినట్లు తూలుతున్నాడు.

రాజా మగత పోగొట్టుకోడానికి ప్రయత్నిస్తూ "మీరు మాస్టరీ జీవితాన్ని చాలా విచిత్రంగాను, యమయాతనగాను, భయంకరంగాను చిత్రిస్తున్నారు. నేను మీలా అనుకోలేకుండా ఉన్నాను."

"ఏ ఉపాధ్యాయుణ్ణి కదిపిచూసినా యిదే ప్రసారం చేస్తాడు. దుయ్యబట్టడం మిమ్మల్ని నిరుత్సాహ పెట్టడానికికాదు."

"అదికాదు నేను అంటూంట! మీరింత క్రూరంగా మాటాడుతూంటే కొంచెం మోతాదు తగ్గించడానికి ప్రయత్నించాను అంతే."

"ఇది యంత్రములాంటిది..."

"అంతవిముఖత చూపేవారు ఎలాఉద్యోగాన్ని చేస్తున్నారని నేను అడిగేది? మీధర్మం మీరు నిర్వహించగలుగుతున్నారా! క్షమించండి ... అలా అడుగుతున్నందుకు."

"మాస్టరు క్షంతవ్యుడేగాని ఒకర్ని క్షమించే అధికారం అతనికిలేదు. ఇది నిరూపించలేని నిజం అని ఉపాధ్యాయు లంటారు. అంతమాత్రాన ఉద్యోగంమీద అసహ్యంపుట్టి దాని విడనాడితే మరి గత్యంతరం? ధర్మంమాట... దీన్నిగూర్చి చెప్పవలసిన అవసరం అంతగా ఉండదు. ధర్మం యొక్క నిర్వచనం నిర్వవచనంగా ఉండనివ్వండి. మరేం ఫరవాలేదు...చెప్పానుగా ... మాస్టరు ఉద్యోగం నేపాళకొమ్మవంటిది. దీనికి చావు భయంలేదు. కొమ్మపాలినా వేళ్ళతో నింపుకొని బలం తెచ్చుకొంటుంది. ఇదిఒక రొంపి. రొంపిలో దూరిన వాడు మళ్ళీబయటకు రాలేడు. మీరేమీ అనుకోపోతే ఇదిమీకూ వర్తిస్తుందని నేను అనుకుంటాను."

"ఎలా" రాజా ఆదుర్దాతో కళ్లుపెద్దవిచేసాడు.

"కాలక్షేపంకోసం చేరిన గ్రాడ్యుయేట్ టీచరు పని మీకు ఏకుమేకయింది." రాజా ఆయన చెప్పే ప్రతీ విషయాన్ని తను ఊహించిన రాళ్ళతో తూచాడు. తేడాలేదు. సరిగా సరిపోయింది. ★